# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :121 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 13-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ...

న్యూఢిల్లీ,జూలై12, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్రే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల్ర ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు- ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

## విశ్వనగరం అంటే హైటెక్ సిటీ కాదు: ఎంపీ ఈటల రాజేందర్



హయత్ నగర్, జూలై 12: విశ్వనగరం అంటే హైటెక్ సిటీ కాదు.. శివారు ప్రాంతాల కాలనీల్లో కూడా మౌలిక వసతులు కల్పించడమే అభివృద్ధి సాధించడమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. శనివారం హయత్ నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ విశ్వనగరమని హైటెక్ సిటీని చూపుతూ అభివృద్ధి సాధించామని గొప్పలు చెబుతుందే తప్ప నగర శివారు ప్రాంతాల కాలనీల్లో కూడా మౌలిక వససతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. హైదరాబాద్ శివారులో కొత్తగా విస్తరించిన కాలనీల్లో గానీ, బస్తీల్లో గానీ సమస్యలు చూస్తే గుండె తరుక్కుపోతుందన్నారు.రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ లేకపోవడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో వరదలకు ఇండ్లు మునిగిపోతున్నాయి తప్ప వరదలను తరలించేందుకు సరైన స్ట్రామ్ వాటర్ డ్రైన్లు ఏర్పాటు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో హయత్ నగర్, మన్సూరాబాద్, నాగోల్ డివిజన్లల్లో సరైన డ్రైనేజీ, రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్ లేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. నగర శివారు కాలనీలు, బస్తీల్లో కూడా మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని చెప్పారు.లక్షలాది మంది నివాసముంటున్న దాదాపు 30 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తున్న ప్రధాన మార్గంలో కూడా కనీసం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నారు. నాగార్జునసాగర్ రోడ్డు నుంచి హయత్‌నగర్‌కు కుమ్మరికుంట, హయత్ నగర్ చెరువు మధ్య ఉన్న 80 నుంచి 100 ఫీట్ల రోడ్డును పునరుద్ధరించేందుకు దాదాపు రూ.6 కోట్లతో త్వరలోనే నిర్మాణ పనులు చేయిస్తానని హామీనిచ్చారు. హయత్ నగర్ డివిజన్‌లో ప్రధానమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

## కుర్చీ పొందడం అంత ఈజీ కాదు.. వచ్చిన అవకాశాన్ని వదులుకోకండి : డీకే శివకుమార్

బెంగళూర్ : కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కుర్చీ పొందడం అంత సులభం కాదన్నారు . అవకాశం వచ్చినప్పుడే ఆ కుర్చీ లో కూర్చోవాలని వ్యాఖ్యానించారు.శుక్రవారం బెంగళూరు న్యాయవాదుల సంఘం నిర్వహించిన కెంపెగౌడ జయంతి వేడుకల్లో పాల్గొన్న డీకే ఈ సందర్భంగా మాట్లాడారు. 'ఖాళీ కుర్చీలు అందుబాటులో ఉన్నప్పటికీ అందులో కూర్చోని చాలా మంది న్యాయవాదులను నేను ఇక్కడ చూస్తున్నాను. కానీ, మేమందరం మాత్రం ఓ కుర్చీ కోసం తీవ్ర పోరాటాలు చేస్తుంటాం. కుర్చీ పొందడం అంత సులభం కాదు. మీరు అవకాశం వచ్చినప్పుడే ఆ సీట్లో కూర్చోవాలి.. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదు. మీలో చాలా మంది త్యాగపూరితంగా ఉన్నట్లు అనిపిస్తోంది. మీకు అవకాశం వచ్చినప్పుడే ఉపయోగించుకోండి' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.కర్ణాటకలో ముఖ్యమంత్రి ని కాంగ్రెస్ అధిష్ఠానం మారుస్తుందని, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను సీఎంను చేస్తారంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో నాయకత్వ మార్పు ఉండదని, తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని స్వయంగా సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేసినప్పటికీ దీనిపై చర్చ మాత్రం ఆగడం లేదు. రాష్ట్రంలో ఐదేండ్ల పాటు పూర్తికాలం తానే ముఖ్యమంత్రిగా ఉంటానని, డీకేను సీఎంను చేయడానికి పదవి నుంచి దిగిపొమ్మని అధిష్ఠానం తనను అడిగినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు.'ఐదేండ్ల పాటు నేనే



సీఎంగా ఉంటా. ఈ విషయం నేను ఎప్పుడో స్పష్టం చేశా. జూలై 2న చేసిన ప్రకటనలో కూడా ఇదే విషయం చెప్పా. ఆ రోజు నా పక్కన శివకుమార్ కూడా ఉన్నారు' అని పేర్కొన్నారు. సీఎం పదవిపై డీకే ఆశపడుతున్న విషయంపై ఆయన మాట్లాడుతూ 'డీకే కూడా ఈ పదవికి ఆశావహుడే. అందులో ఎలాంటి తప్పు లేదు. ఆయన కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నారు. కానీ సీఎం కుర్చీ ప్రస్తుతం ఖాళీ లేదు' అని చెప్పారు. కాంగ్రెస్ హైకమాండ్ నుంచి తనకు పూర్తి మద్దతు ఉందని పేర్కొన్నారు. గాంధీలు సహా కాంగ్రెస్ అగ్ర నాయకుల పూర్తి మద్దతు తనకు ఉందని, వారి మద్దతు లేకుంటే సీఎం పదవిలో కొనసాగి ఉండేవాడిని కాదని సిద్ధరామయ్య తెలిపారు.

## న్యాయవ్యవస్థలో ఇప్పుడు ఏఐని ఉపయోగించుకోవచ్చు..



హైదరాబాద్, హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ, తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ , నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, "మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు , న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం," అన్నారు."న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుంది," అని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, "మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదు," అని చెప్పారు."మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలి," అని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## నిజమైన కార్యకర్తలకు గుర్తింపు లేదు.. రేణుకా చౌదరి

హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావాడానికి కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు ఎంతో కష్టపడ్డారని, నిజమైన కార్యకర్తలకు గుర్తింపు లేదని ఎంపీ (రాజ్యసభ) రేణుకా చౌదరి మండిపడ్డారు. పార్టీలో అడ్రస్ లేని వారికి పదవులు ఇచ్చారన్నారు. పార్టీలో అంతర్గతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకుని స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లనున్నట్లు చెప్పారు. పదవుల విషయంలో పార్టీలో చాలా అసంతృప్తి ఉందన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన కార్యకర్తలెవరికీ గుర్తింపు లభించడం లేదని ఆరోపించారు. చుట్టపుచూపుగా వచ్చిన వారికి.. అడ్రస్ లేని వాళ్లకు పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు.

నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరిగే సహించను


అసలుసిసలైన కార్యకర్తలకు అన్యాయం జరిగితే మాత్రం తాను ఊరకునేది లేదని ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయడం లేదని విమర్శించారు. తాను ఖమ్మం జిల్లా ఆడబిడ్డనని, తనను ఆపేది ఎవరని మండిపడ్డారు. పార్టీ పదవుల విషయంలో తనకే అసంతృప్తిగా



ఉందని.. ఇక సాధారణ కార్యకర్తలకు ఉండదా అని కామెంట్ చేశారు. స్థానిక ఎన్నికల్లోపు పార్టీలో అసంతృప్తి అన్న మాట వినపడకుండా చేయాలని ఆమె రాష్ట్ర అధినాయకత్వంతో పాటు పార్టీ హైకమాండ్‌కు రేణుక చౌదరి విజ్ఞప్తి చేశారు.

## బిసిలను మరోమారు మోసం చేస్తున్న రేవంత్

న్యూఢిల్లీ,జూలై12: బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తేలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక



గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు- చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు- దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల...ఉత్తమ్ కు థ్యాంక్స్ చెప్పిన తుమ్మల



హైదరాబాద్,సీతారామ ప్రాజెక్టు నుంచి సాగు నీటిని శనివారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో సీతారామ ప్రాజెక్టు నుంచి అధికారులు గోదావరి జలాలను విడుదల చేశారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద మొదటి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి శనివారం ఉదయం నీటిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల వినతికి స్పందించిన మంత్రి తుమ్మల..


ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్న దృష్ట్యా సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేశారు. నాగార్జున సాగర్‌లో ఇన్‌ఫ్లో పెరిగినప్పటికీ తగినంత నీరు చేరలేదు. దీంతో ఇప్పట్లో సాగర్ ఎడమ కాలువల ద్వారా నీరు విడిచిపెట్టే అవకాశం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా సీతారామ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్న దృష్ట్యా రైతుల వినతికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. ఈ విషయమై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సంప్రదించారు. పరిస్థితి వివరించారు. ఈ విషయమై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లతోనూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం ఉదయం సమీక్ష చేశారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు విడుదల చేశారు.

## నీతీశ్ సర్కార్ శుభవార్త.. ప్రతి కుటుంబానికి ఉచిత విద్యుత్!

పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికారపక్షమైన ఎన్డీయే ఇప్పటికే మహిళా రిజర్వేషన్, పెన్షన్ పెంపుపై హామీ ఇచ్చింది.తాజాగా రాష్ట్ర ప్రజలకు మరో పథకం ఇచ్చేందుకు నీతీశ్‌కుమార్ ప్రభుత్వం సిద్ధమైంది. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిపాదనను ఆర్థిక శాఖ ఆమోదించింది కానీ.. కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది.రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందించడానికి ఇంధన శాఖ ఓ ప్రతిపాదనను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనను మొదట ఆర్థిక శాఖకు పంపగా.. అక్కడ ఆమోదించబడింది. ఈ ప్రతిపాదన ప్రకారం.. వినియోగదారులు 100 యూనిట్ల వరకు ఎటువంటి ఛార్జీ చెల్లించాల్సిన అవసరం లేదు. 100 యూనిట్లు దాటితే.. యూనిట్‌కు ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎంత అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో వినియోగదారుల నుంచి మొదటి 50 యూనిట్లకు.. ఒక్కో యూనిట్‌కు రూ.7.57 వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత రూ.7.96 ఛార్జీ చేస్తున్నారు.ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శనివారం సామాజిక భద్రతా పెన్షన్ పథకాన్ని పెంచుతున్నట్లు



ప్రకటించారు. పెన్షన్ ఇప్పుడు నెలకు రూ.400కు బదులుగా రూ.1100 అవుతుంది. పెరిగిన పెన్షన్ మొత్తం జూలై నుండి ప్రారంభమవుతుందని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1 కోటి 9 లక్షల 69 వేలకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## రేవంత్ పాలనలో సేవ కంటే ప్రచారానికే ప్రాధాన్యం



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత . రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు , పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కాకునూర్ గ్రామంలో కవిత పోస్ట్ కార్డు ఉద్యమాన్ని నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉండేది తక్కువని.. ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటారని వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించారు. సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు.రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు.

## సంపాదకీయం

**ఆదివారం 13-07-2025**

# మానవ వనరుల వినియోగంలో వైఫల్యం !

జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి. కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది. జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృధా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు. స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఎపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగించుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు. ఇదంతా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచన లు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి. ఈ దుస్థితి పోవాలంటే జనాభాను తగ్గించుకోక తప్పదు.

# సౌండ్ కిల్లర్స్! రోడ్లపై విపరీతమైన రొద...



హైదరాబాద్,పకృతిలో కోయిలమ్మ కుహూ కుహూ రాగాలు..చిలుకమ్మ కిలకిల రావాలు.. పిచ్చుకలు, గువ్వల సందడి, సెలయేళ్ల పరవళ్లు.. సరిగమ పదనిసల సంగీత ఝరికి పునాదులు. ఉల్లాసం,, ఉత్సాహం పంచే ఈ గమకాలు శబ్ధ కాలుష్య అవతారం ఎత్తింది. డమ డమ అంటూ బుల్లెట్టు బండ్లు వీధిలోకి అడుగు పెట్టగానే గుండె దడ దడ దద్దరిల్లుతోంది. ఇక సైలన్సర్ తీస్తే.. ఆ విధ్వంసమే వేరబ్బా. డాం.. డాం అంటూ బాంబుల మోత .. జనాన్ని ఉరుకులు పరుగులు పెట్టిస్తుంటే.. అడ్డుకోవాల్సిన పోలీసులు రోడ్డు పక్కన ఉచిత జ్యూస్ తాగుతూ వీధి వినోదం పంచుకోవటం సర్వసాధారణంగా మారింది. జనం ప్రాణాలను తీసే మహా ఉత్పాతంగా అవతరిస్తున్న ఈ సౌండ్ పొల్యూషన్ ఏంటో తెలుసా? ఇది ఒక సైకో కిల్లర్. ఈ సైకోను అడ్డుకోవటం అత్యవసరం. అనివార్యం. అతి సంగీత గతి, స్థితిని ఒక్కసారి పరిశీలిద్దాం. ఇంట్లో ఏదేని పని హడావిడిగా చేస్తూ పొరపాటున చేతిలో ఉన్న స్టీల్ వస్తువు జారి కింద పడితే అసహనానికి గురి అవుతాం. కొన్ని క్షణాల పాటు వచ్చిన శబ్దానికి చికాకు పడే మనం ఆధునిక జీవన శైలిలో రోజంతా వివిధ వాహనాలు, మోటార్లు చేసే శబ్దాలతో సహజీవనం చేస్తున్నాం. వివిధ రకాలైన శబ్దాలు పరిమితికి మించి చెవిని తాకడాన్ని శబ్ద కాలుష్యం అంటారు. శబ్ద కాలుష్యం మానవ శారీరక మానసిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. కాలుష్యం అంటే నీటి కాలుష్యం, వాయు కాలుష్యం మాత్రమే ప్రమాదకరమైనవి అని భావిస్తుంటాం. కానీ శబ్ద కాలుష్యం కూడా మానవ జీవ వ్యవస్థపై అధిక ప్రభావాన్ని చూపిస్తోంది. మానవ చెవి నిర్దిష్ట పౌనఃపున్య పరిధిలో అంటే సాధారణంగా 20 హెర్ట్జ్ నుంచి 20,000 హెర్ట్జ్ మధ్య గల శబ్దాలను వినగలదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పక్రారం.. 65 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దస్థాయిని శబ్ద కాలుష్యంగా పరిగణిస్తారు. 75 డీబీ కంటే ఎక్కువ శబ్దం స్థాయి చాలా హానికరం. శబ్ద కాలుష్యం భూమిపైగల జీవజాతులతో పాటుగా, సముద్రంలో నివసించే జీవజాతులను సైతంప్రభావితం చేస్తోంది. కానీ పెరుగుతున్న మోటార్ బైకుల వల్ల, కారుల వల్ల రోజు రోజుకి శబ్ద తీవ్రత పెరిగి అది ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. మహా నగరాలలో ఈ శబ్ద కాలుష్యం పరిమితిని ఎప్పుడో దాటేసింది. ఇప్పుడు వర్ధమాన నగరం మచిలీపట్నం, నగర స్థాయికి ఎదుగుతున్న గుడివాడ.. అంతే కాదు.. మున్సిపాలిటీల్లోనే కాదు.. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే రొద.. కర్ణభేరిపై దాడి. ఈ శబ్ద కాలుష్యం రెక్కలు విప్పు కుంటోంది. సైలెన్సర్లు లేని బైకులు.. మితిమీరిన హారన్ల వాహనాలు ఇక డీజేలే.. శబ్ద కాలుష్య ఉత్పాతానికి ప్రధాన కారణాలు.

### పోలీసులంటే లెక్కలేదంతే

పోలీసుల ఉత్తర్వుల ప్రకారం నివాస ప్రాంతాలలో ధ్వని తీవ్రత పగటిపూట 55 డీబీ, రాత్రివేళ 45డీబీ, వాణిజ్య ప్రాంతాల్లో పగటి పూట 65డీబీ, రాత్రి 55 డీబీ, పారిశ్రామిక ప్రాంతాల్లో పగటిపూట 75 డీబీ, రాత్రి 70 డీబీకి మించకూడదు. రాత్రి10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్ లేదా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ లేదా డీజే సిస్టమ్ ఉపయోగించరాదు. మ్యూజిక్ పరికరాలను అద్దెకు తీసుకుకోవాలంటే సౌండ్ సిస్టమ్స్ సరఫరా వ్యక్తులకు పోలీస్ క్లియరెన్స్ అవసరం. కానీ పట్టణ, నగరాల్లో సైలెన్సర్లు లేని బైకుల రొద, డీజె ల గుండదడ.. ఇక గ్రామాల్లోనూ శబ్ధకాలుష్యం ఎక్కడ తగ్గటం లేదు. అపరాత్రి లేదు. అర్థరాత్రి లేదు. క్రైస్తవ కూటములు.. పెద్ద పెద్ద కేకలు .. ఈ గోలతో పగలంతా పొలాల్లో పని చేసి.. అలసటతో నిద్రపోయే జనాన్ని .. ఈ క్రైస్తవ గురువులు తమ కేకలతో అల్లాడిస్తున్నారు. ఇదిలా ఉంటే.. వీరికి పోటీగా హిందూత్వ సంస్థలు రంగంలోకి దిగాయి. భజనలతో జనాన్ని అల్లాడిస్తున్నారు. వీరందరికీ పోలీసులు అనుమతి తప్పనిసరి .. ఇక జనం మాత్రం శబ్దకాలుష్యానికి బలి పశువులు కావాల్సిందే.

### రేసు గుర్రాలకు ముక్కుతాడేది ?

నేటి మారిన ఆధునిక జీవన శైలిలో ప్రతి చిన్న పనికీ మోటార్ వాహనాల మీద, మోటార్ల మీద ఆధారపడడం తప్పనిసరి అయింది. మోటార్లు చేసే శబ్దాన్ని నిరోధించడానికి వాటికి తయారీదారులు సైలెన్సర్లు అమరుస్తారు. కానీ తయారీ దారులు ఇంజన్లకు ఏర్పాటు చేసిన సైలెన్సర్లను తొలగించి మరీ విపరీతమైన శబ్దం చేస్తూ కొందరు ఆకతాయిలు రోడ్లపై వాహనాలు నడుపుతున్నారు. తయారీదారు వాహనంతో అమర్చిన హారన్‌లను తొలగించి వింత వింత శబ్దాలతో కూడిన హారన్ లను బిగిస్తున్నారు. వింత శబ్దాలతో కూడిన హారన్ లను పెద్దగా మోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమౌతున్నారు. ఎక్కువ సీసీ, కొత్త టెక్నాలజీ తో వచ్చే ద్విచక్ర వాహనాలలో ఇంజిన్ శబ్దాన్ని నిరోధించకుండా ఉండేలా సైలెన్సర్లు ఏర్పాటు చేస్తున్నారు. యువతను ఆకర్షిస్తూ సమాజంలో శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలను నిషేధించాల్సిన అవసరం ఉంది.

### చాలిక.. ఆపంంద్రోయ్

రక రకాల ఫంక్షన్లకు, ఉత్సవాలకు డీజే ఏర్పాటు నేటి తరం పోకడ. ఈ డీజే వల్ల విపరీతమైన శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది. ఈ మధ్య కాలంలో డీజే శబ్దాలు కొంతమంది పాలిట మృత్యు శబ్దాలుగా మారి ఆయా కార్యక్రమాలలో పాల్గొన్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. డీజే లలో పాటలు వినే హృద్రోగుల గుండె లబ్ -డబ్ అని కొట్టు కోవడం మాని ఆపంంద్రోయ్ఆపంంద్రోయ్ అని బెంబేలెత్తుతుంది. డీజే లను నిషేధించాలనే డిమాండ్లు రోజు రోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతానికైతే అవి మానవ ఆరోగ్యాన్ని స్పీకర్లలో వేసి ఆడిస్తున్నాయి.

### ఈ కష్టాలతో.. అల్లాడాల్సిందే

శబ్ద కాలుష్యంతో తీవ్ర శారీరక సమస్యలు వినికిడి లోపం, గుండె సంబంధిత సమస్యలు, అధిక రక్తపోటు, నిద్రలేమి, అలసట, టిన్నిటస్ (చెవులలో శబ్దాలు వినిపించడం) తో పాటు చికాకు, అధిక ఒత్తిడి, ఏకాగ్రత తగ్గడం వంటి మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించవలసిన బాధ్యత స్థానిక పోలీస్, రెవిన్యూ, మునిసిపల్ కాలుష్య నియంత్రణ బోర్డు పై ఉంటుంది. కానీ ఆ దిశగా ఏ శాఖా కూడా తగిన కార్యాచరణతో లేదన్నది సుస్పష్టం. ఏదేని తప్పని సరి పరిస్థితులలో సంబంధిత వాహనాలపై లేదా కాలుష్య కారకాలపై జరిమానా వసూలుతో సరి పెడుతున్నారు. కానీ ఈ శబ్ద కాలుష్యంతో పసి పిల్లలూ,వృద్ధులూ,హృద్రోగులూ అల్లాడిపో తున్నారు. ఇది నిజం.

## సత్ఫలితాలు ఇచ్చిన బడిబాట

హైదరాబాద్, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాన్ని ఇచ్చింది. ఎందరో పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్‌లో చేరారు. వివిధ తరగతుల్లో మొత్తం 3.68 లక్షల మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారు. ఈ విషయంపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 'మన తెలంగాణ'తో పాటు- వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలను జత చేసి ఆయన ఎక్స్ వేదికగా తన సంతోషాన్ని తెలియజేశారు. పదేళ్ల చీకట్లను పారదోలి... ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి. పేద బిడ్డల చదువుల గుడులు అక్షర మంత్రోశ్చారణలతో పవిత్రతను సంతరించుకున్నాయి. సర్కారు బడికి గత పాలకులు వేసిన తాళాలు బద్ధలవుతున్నాయ. పాఠశాలల్లో కనిపిస్తోన్న ఈ గుణాత్మక మార్పు తెలంగాణ భవిష్యత్ గమనానికి సంకేతం. ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం.

# భారత్,చైనా సంబంధాలు మెరుగవుతున్నాయా?

న్యూఢిల్లీ,భారత్, చైనాలు తమ సరిహద్దుల్లో ఏళ్ల తరబడి ఉద్రిక్తతల తర్వాత నెమ్మదిగా సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల భారత్‌కు చెందిన ఇద్దరు సీనియర్ ప్రతినిధులు చైనాను సందర్శించడాన్ని రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయనడానికి సంకేతంగా చూస్తున్నారు. జూన్‌లో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు వేరువేరుగా షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశాల కోసం చైనాలో పర్యటించారు. షాంఘై సహకార సంస్థలో చైనా, రష్యా, ఇరాన్, పాకిస్తాన్ తదితర దేశాలు సభ్యులుగా ఉన్నాయి. గత ఐదేళ్లలో చైనాలో పర్యటించిన మొదటి సీనియర్ భారత ప్రతినిధి రాజ్‌నాథ్ సింగ్ మాత్రమే.

### భారత్, చైనా మధ్య ప్రధాన సమస్య

భారత్, చైనా మధ్య ప్రధాన సమస్య వారి 3,440 కిలోమీటర్ల సరిహద్దు. కొన్నిచోట్ల ఇది స్పష్టంగా గుర్తించలేదు. నదులు, సరస్సులు, మంచు కారణంగా కొన్ని ప్రాంతాలలో సరిహద్దు మారుతుంటుంది, దీనివల్ల రెండు దేశాల సైనికుల మధ్య ఘర్షణలు తలెత్తిన సందర్భాలున్నాయి.

### కీలక ఒప్పందాలు

2020 జూన్‌లో లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికులు ఘర్షణ పడిన తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. 1975 తర్వాత ఈ రెండు దేశాల మధ్య సైనికులు ప్రాణాలు పోయినంతటి తీవ్ర పోరాటం ఇదే. ఈ ఘటనలో కనీసం ఇరవై మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు మరణించారు. అప్పటి నుంచి, రెండు వైపులా సైనిక ప్రతిష్టంభనలు నెలకొన్నాయి. కానీ, ఇప్పుడు వారు మాట్లాడుకోవడానికి, కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉన్నట్లు కనిపిస్తోంది. నిరుడు లద్దాఖ్ ప్రాంతంలో కొన్ని ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి భారత్, చైనాలు అంగీకరించాయి. రెండు దేశాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులను జనవరిలో తిరిగి ప్రారంభించారు, వీసా ఆంక్షలను సడలించారు.

### భారత యాత్రికులకు అనుమతులు

ఆరేళ్ల తర్వాత భారత యాత్రికులకు టిబెట్ అటానమస్ రీజియన్‌లోని 'పవిత్ర కైలాశ పర్వతం', సరస్సును సందర్శించడానికి అనుమతులు లభించాయి. అయినప్పటికీ, రెండు దేశాల మధ్య సవాళ్లు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. భారత రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి చైనా. నిరుడు చైనాతో భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. భారత్ ముఖ్యంగా అరుదైన భూఖనిజాల(రేర్ ఎర్త్ మినరల్స్) కోసం చైనాపై ఆధారపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవడానికి సరిహద్దు ప్రాంతాలలో శాంతి చాలా అవసరం.

### చైనా ఎక్కువగా తైవాన్‌పైనే దృష్టి

చైనా ఎక్కువగా తైవాన్‌పైనే దృష్టి పెడుతోంది, కాబట్టి ప్రస్తుతానికి ఉమ్మడి హిమాలయ సరిహద్దులో భారత్‌తో శాంతిని కోరుకుంటోంది. కానీ, తమ ఎదుగుదలను అడ్డుకోవడానికి అమెరికా, పాశ్చాత్య దేశాలు ఇండియాను ఉ



పయోగిస్తున్నాయని చైనా అనుమానిస్తోంది. కాబట్టి, సరిహద్దు వద్ద శాంతితో పాటు భారత్ విషయంలో ఇతర అంశాలలోనూ మెరుగుదల కోరుకుంటోంది చైనా. భారతదేశంతో వాణిజ్యాన్ని పెంచుకోవాలని, ఎక్కువ పెట్టుబడులు పెట్టాలని, తమ కార్మికులు, ఇంజినీర్లపై వీసా నిషేధాలను ఎత్తివేయాలని చైనా ఆశిస్తోంది (2020 సరిహద్దు ఘర్షణ తర్వాత, భద్రతా కారణాల దృష్ట్యా భారత్ అనేక చైనీస్ యాప్‌లను నిషేధించింది, చైనా పెట్టుబడులను పరిమితం చేసింది.

### సరిహద్దు సమస్య పరిష్కరించుకుంటేనే..

చైనా తన వాణిజ్యాన్ని పెంచుకోవాలనుకున్నప్పటికీ, భారతదేశంతో తన సరిహద్దు వివాదాలపై వెనక్కి తగ్గడంలేదు. భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌ను "దక్షిణ టిబెట్" అని పిలుస్తూ చైనా తన వాదనను పెంచుతోంది. కాగా, అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో పూర్తి భాగమని దిల్లీ నొక్కి చెబుతోంది, ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికల్లో ఓటు వేస్తారని అంటోంది. ఈ నేపథ్యంలో "చైనా, భారత్ సార్వభౌమాధికార భావనను వదులుకోకపోతే, వారు ఎప్పటికీ పోరాడుతూనే ఉంటారు" అని షాంఘైలోని ఫుడాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ షెన్ డింగ్లీ చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్‌పై వారు ఒక ఒప్పందానికి రాగలిగితే, రెండు దేశాలు శాశ్వత శాంతిని పొందుతాయని షెన్ అభిప్రాయపడ్డారు .

### భారతదేశం చైనాకు ఎందుకు ముఖ్యమైనది?

సిల్క్ రోడ్డు భారతదేశం మరియు చైనా మధ్య ప్రధాన వాణిజ్య మార్గంగా పనిచేయడమే కాకుండా, భారతదేశం నుండి తూర్పు ఆసియాకు బౌద్ధమతం వ్యాప్తి చెందడానికి దోహదపడింది. 19వ శతాబ్దంలో, భారతదేశంలో పండించిన నల్లమందును ఎగుమతి చేసే ఈస్ట్ ఇండియా కంపెనీతో చైనా పెరుగుతున్న నల్లమందు వ్యాపారంలో పాల్గొంది.

### 1967 భారత-చైనా యుద్ధంలో ఎవరు గెలిచారు?

1967 నాటి నాథు లా మరియు చో లా ఘర్షణలలో చైనాతో జరిగిన ఘర్షణలలో భారతదేశం విజయం సాధించింది. ఈ ఘర్షణలు, 1962 యుద్ధం కంటే చిన్న స్థాయిలో ఉన్నప్పటికీ, భారతదేశానికి గణనీయమైన విజయం, 1962 ఓటమి తర్వాత ఆత్మస్థైర్యాన్ని పెంచాయి మరియు ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించాయి. భారత సైన్యం నాథు లా మరియు చో లా రెండింటిలోనూ చైనా దాడులను విజయవంతంగా తిప్పికొట్టింది, భారీ ప్రాణనష్టం కలిగించింది మరియు చైనీయులను వెనక్కి తగ్గేలా చేసింది.

# కొత్త పుంతలు తొక్కుతున్న ఆవిష్కరణలు

టోక్యో,ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఆవిష్కరణలు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏఐతో ప్రపంచం అంతా మారిందనుకుంటున్న వేళ అన్నింటా అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయి. బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు చూస్తున్నాం. రోబోలతో మొత్తం ప్రపంచ గతి మారుతోంది. వైద్యరంగంలోనూ ఆవిష్కరణలుకొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఈ క్రమంలో అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైనదని అంటున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నళ్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించు కునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది. జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇక భారత్‌లోని సగటు ఇంటర్నెట్ స్పీడ్‌తో పోలిస్తే దీని బ్రౌజింగ్, డౌన్‌లోడింగ్ వేగం 16 మిలియన్ రెట్లు ఎక్కువని తెలిపింది. ఎన్ఐసీటీలోని ఫొటోనిక్ నెట్‌వర్క్ లాబోరేటరీ టీమ్, సుమితోమో ఎలక్ట్రిక్ అండ్ యూరోపియన్ పార్టనర్స్‌తో కలిసి జపాన్ ఈ ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఇంటర్నెట్‌తో కేవలం ఒక్క సెకనులోనే ఇంగ్లీష్ వికీపీడియా మొత్తాన్ని 10వేల సార్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ వికీపిడియా స్టోరేజీ 100 జీబీ వరకు ఉంటు-ంది. ఇక, కొత్త ఇంటర్నెట్‌తో ఒక్క సెకనులోనే 8కే రిజల్యూషన్‌తో ఉన్న వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జపాన్ పరిశోధకులు చెబుతున్నారు.

# ఇంధన సరఫరా స్విచ్‌లో ఆఫ్ అయ్యాయా

వాషింగ్టన్,ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంలో ఇంధన సరఫరా స్విచ్‌లను ఆఫ్ చేసినట్లు సందేహాలను వ్యక్తంచేస్తూ అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. విమానం గాల్లోకి ఎగిరే సమయంలో స్విచ్‌లు సాధారణంగానే ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. అవి ఎలా ఆఫ్ అవుతాయనే విషయాన్ని నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ఆపారా..? తిరిగి ఆన్ చేయడానికి ప్రయత్నించారా అనే అంశాన్ని వారు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని వెల్లడించింది. స్విచ్‌లు ఆఫ్ అయితే మాత్రం ర్యాట్ ఎందుకు యాక్టివేట్ అయిందో చెప్పే అవకాశం ఉంది. అమెరికా అధికారుల అంచనాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానంలోని జీఈ సంస్థకు చెందిన రెండు జెట్ ఇంజిన్లు సక్రమంగానే పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లు ఆఫ్ అయి ఉంటాయని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు- పేర్కొంది. దీంతో టేకాఫ్ అయిన వెంటనే హఠాత్తుగా విమానం థ్రస్ట్‌ను కోల్పోయి ఉండొచ్చని పేర్కొంది. సాధారణంగా విమానం ఇంజిన్లను స్టార్ట్ చేయడం లేదా షట్‌డౌన్ చేయడానికి, కొన్ని అత్యవసర సందర్భాల్లో రీసెట్ కోసం వాడుతుంటారు. మరోవైపు భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తోంది. ప్రాథమిక నివేదిక అతిత్వరలో విడుదల కావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ప్రస్తుతం భారత దర్యాప్తునకు సహకారం అందిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఇతర దేశాలకు డేటాను షేర్ చేయడంలో అభిప్రాయభేదాలున్నట్లు- వాల్‌స్ట్రీట్ చెబుతోంది. ఈ ప్రమాదంపై అమెరికా అధికారులు ఆ పత్రికతో మాట్లాడుతూ విమానం మోడల్, లేదా జీఈ ఇంజిన్లతో దుర్ఘటనకు సంబంధం లేదని దర్యాప్తు సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఎఫ్ఏఏ లేదా బోయింగ్, జీఈలు ఎటువంటి సర్వీస్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. మరోవైపు వైమానిక రంగానికి చెందిన పత్రిక 'ది ఎయిర్ కరెంట్' కూడా ఈ ప్రమాద దర్యాప్తు మొత్తం ఇంధన కంట్రోల్ స్విచ్‌ల చుట్టూనే తిరిగినట్లు పేర్కొంది. దర్యాప్తు ముందుకుసాగే కొద్దీ చేరే కొత్త సమాచారంతో ఈ అంచనాలు, అభిప్రాయాలు మారుతుంటాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు-చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

## రష్యా నుంచి చమురు దిగుమతులు

న్యూఢిల్లీ, రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ ప్రపంచానికి మేలు చేసిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఓరకంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిందని అన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు. రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేదని పురి అన్నారు. సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించు కోవాల్సి వస్తుంది. అది అసాధ్యం.

# మోడీకి ఆర్ఎస్ఎస్ ఎసరు?



న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్రమోడీకి బీజేపీ మెంటార్ గా భావించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎసరు పెడుతోందా? బీజేపీలో, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మోడీ వ్యక్తిపూజ పీక్స్ చేరిందని భావిస్తున్న ఆర్ఎస్ఎస్ ఆయన పదవి దిగిపోవాలని కోరుకుంటోందా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. ఇప్పటికే గుజరాత్ ముఖ్యమంత్రిగా నాలుగు సార్లు, ఆ తరువాత దేశ ప్రధానిగా వరుసగా మూడో సారి కొనసాగుతున్న ప్రధాని మోడీని ఆ పదవి నుంచి దిగిపోవాల్సిందేననీ, ఆ టైమ్ ఇచ్చేసిందనీ పరోక్షంగా ఆర్ఎస్ఎస్ గుర్తు చేస్తుండటం వెనుక ఉద్దేశం అదేనని అంటున్నారు. వచ్చే సెప్టెంబర్ తో ప్రధాని మోడీకి 75 ఏళ్లు వస్తాయి. ప్రధాని మోడీ హవా బీజేపీలో మొదలైన తరువాత ఆయనే 75 ఏళ్ల వయస్సు నిబంధనను తీసుకువచ్చారని చెప్పాలి. 75 సంవత్సరాలు వచ్చిన వారెవరూ పార్టీ, ప్రభుత్వ పదవులు నిర్వహించకుండా నిబంధన విధించారు. ఇప్పుడు మోడీ 75 సంవత్సరాల నిబంధన పరిధిలోకి వస్తున్నారు. ఇక్కడ వయస్సు నిబంధన విషయంలో మోడీకి మినహాయింపు ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. అయితే ఆర్ఎస్ఎస్ మాత్రం మోడీకి వయస్సు గురించి గుర్తు చేస్తూ వారసుడి అన్వేషణ అనివార్యం అని హెచ్చరిక లాంటి సూచన చేస్తోంది. ముఖ్యంగా ఆర్ ఎస్ ఎస్ చీఫ్ మోహన్‌భగవత్.. ఈ విషయంలో గట్టి పట్టుదలతో ఉన్నారని ఆర్ఎస్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఆయన వయస్సు విషయంలో చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోడీకి ఓ హెచ్చరికేనని అంటున్నారు. స్థాయితో సంబంధం లేకుండా నాయకుడనే వారు ఎవరైనా సరే నిబంధనలు పాటించి తీరాలి. అలా పాటించకపోతే అసలు నిబంధనలు ఎందుకు? అంటూ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు మోడీ ప్రధానిగా కొనసాగే విషయంలో ఆయన విస్పష్టంగా తన అభ్యంతరాన్ని చెప్పినట్లుగానే ఉన్నాయి. 75 ఏళ్లు వచ్చిన తరువాత ఎవరైనా సరే తమ పదవులు త్యాగం చేయాల్సిందేనని మోహన్ భగవత్ కుండబద్దలు కొట్టారు. దీంతో నరేంద్ర మోడీ ప్రధాని పదవిలో కొనసాగడంపై దేశ వ్యాప్తంగా విస్తృతంగా చర్చ మొదలైంది. ఎందుకంటే ఈ ఏడాది సెప్టెంబర్ తో ఆయనకు 75 ఏళు వస్తాయి. ఈ క్రమంలో నిబంధనల మేరకు ప్రధాని పదవిని వదులు కోవాల్సి ఉంటుందని అంటున్నారు.ఇదేసమయంలో ఆర్ ఎస్ ఎస్ చీఫ్‌గా ఉన్న మోహన్‌భగవత్ కూడా అదే నెలలో పదవీ త్యాగం చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఆయన మోడీ కంటే కూడా.. ముందే 75వ వసంతంలోకి అడుగు పెట్టనున్నారు. దీంతో ముందు ఆయన రిజైన్ చేసి..కొత్తవారికి పగ్గాలు అప్పగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే జరిగితే.. ప్రధాని మోడీకి కూడా తాను తప్పుకుని కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడుతుందని అంటున్నారు. కానీ.. బీజేపీని మూడుసార్లు వరుసగా అధికారంలోకి తెచ్చిన నాయకుడిగా మోడీ పదవి నుంచి తప్పుకోవడానికి బీజేపీ అంగీకరిస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రపంచ దేశాలకు కూడా 'విశ్వగురు'గా గుర్తింపు పొందిన మోడీ.. ఇప్పటికిప్పుడు అధికారం నుంచి దిగితే? ఎలా అన్న ప్రశ్న బలంగా వినిపిస్తోంది. ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు, వన్ నేషన్-వన్.. ఇలా దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ సాధించాలని ప్రయత్నిస్తున్న లక్ష్యాలను మోడీ తనహయాంలో సాధించి చూపారు. ఈ నేపథ్యంలో మోడీకి దిగిపోవాలంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పరోక్ష హెచ్చరిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక మోడీకి సన్నిహితుడు.. మోడీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచీ ఆయనకు కుడి భుజంగా ఉంటూ వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాను ప్రధాని రేసులో లేనని విస్పష్టంగా చెప్పేశారు. తాను రాజకీయ రిటైర్మెంట్ తీసుకోనున్నట్లు వెల్లడించారు.ఈ పరిస్థితుల్లో మోడీని కొనసాగించడమే మంచిదని బీజేపీ భావిస్తోంది. కానీ ఇక్కడే ఆ పార్టీకి గట్టి చిక్కు వచ్చి పడింది. బీజేపీ సీనియర్ మోస్ట్ నాయకులు అద్వానీ, మురళీమనోహర్ జోషి వంటి వారి విషయంలో మోడీషా ద్వయం అనుసరించిన విధానంపై బీజేపీలోనే తీవ్ర అసంతృప్తి ఉంది. అటువంటి నాయకుల విషయంలో వయస్సు నిబంధనను కఠినంగా అమలు చేసి వారిని రాజకీయాలకు దూరం చేసిన తీరు పట్ల జనసామాన్యంలో కూడా ఒకింత అసహనం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు మోడీ కూడా స్టెప్ డౌన్ అయి.. వయస్సు నిబంధన అన్నది తనకు కూడా వర్తిస్తుందని రుజువు చేసుకోవలసిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు. మొత్తం మీద 75 ఏళ్ల వయస్సు నిబంధన ఇప్పుడు మోడీ విషయంలో అమలు అవుతుందా? లేదా అన్న ఉత్కంఠ దేశ వ్యాప్తంగా వ్యక్తం అవుతోంది.

# డీకేకు ఎసరు పెడుతోన్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూర్ :కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య కొనసాగుతున్న కోల్డ్ వార్ తదుపరి దశకు చేరినట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. తాజాగా డీకే శివకుమార్‌ను పీసీసీ (ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్ష పదవి నుంచి తప్పించేందుకు సిద్ధరామయ్య వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

-అధిష్ఠానాన్ని ఒప్పించే ప్రయత్నాలు

సిద్ధరామయ్య శిబిరం ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో కీలక సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో డీకే శివకుమార్‌ను పీసీసీ చీఫ్ పదవి నుంచి తొలగించి, కొత్త నేతను నియమించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్న సీనియర్ ఎస్టీ నేత సతీష్ జార్కిహోళి పేరును ఆ స్థానానికి సిఫార్సు చేశారు. కర్ణాటకలో ఎస్టీ ఓట్ల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని జార్కిహోళిని ప్రొజెక్ట్ చేయాలని సిద్ధరామయ్య వర్గం భావిస్తోంది.

"ఒకరికి ఒక పదవి" సూత్రంపై వాదన

"ఒకరికి ఒకే పదవి" అనే కాంగ్రెస్ పార్టీ నియమాన్ని పునరుద్ఘాటిస్తూ డీకే శివకుమార్ ఇప్పటికే రెండు కీలక పదవులు ఉపముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ చేపట్టిన నేపథ్యంలో ఆయనను పీసీసీ చీఫ్ పదవి నుంచి తప్పించాలని సీఎం వర్గం బలంగా వాదిస్తోంది. ఒకవేళ జార్కిహోళికి పీసీసీ పదవి ఇస్తే, మంత్రి పదవిని వదులుకోవాలని ఆయనను ఒప్పించినట్లు కూడా తెలుస్తోంది.

– డీకే అధికారాలకు కత్తెర వేయాలనే వ్యూహం

డీకే శివకుమార్ పార్టీ అధ్యక్షుడిగా తన మద్దతుదారులుగా ఉన్న ఎమ్మెల్యేలను స్వతంత్రంగా ప్రభావితం చేయకుండా నియంత్రించేందుకు ఈ ప్రయత్నాలు



జరుగుతున్నాయి. పార్టీ వ్యవస్థపై ఆయన ఆధిపత్యాన్ని తగ్గించే దిశగా సీఎం వర్గం వ్యూహరచన చేస్తోంది. ఈ మార్పులు ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో అమలయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

-విభేదాల తారాస్థాయికి

ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్‌కు ఇవ్వాలన్న వాదన, సిద్ధరామయ్య వైఖరితో తీవ్రంగా విభేదిస్తోంది. దీంతో, ఇద్దరు నేతల మధ్య అంతర్గత విభేదాలు పార్టీలో తీవ్ర రూపం దాల్చాయి. ఈ నేపథ్యంలో, వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీలో నాయకుల సమన్వయం లోపించే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు డీకే శివకుమార్ రాజకీయ భవిష్యత్‌పై ఎంతమేర ప్రభావం చూపుతాయో చూడాలి. అధిష్ఠానం చివరికి ఎవరి వాదనను అంగీకరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పులు నిజంగానే జరుగుతాయా లేక ఇది కేవలం ఒత్తిడి రాజకీయమా అన్నది త్వరలోనే స్పష్టమవుతుంది.

# వరంగల్ జిల్లాను చుట్టేస్తున్న ములుగు కుంపటి...



వరంగల్ : ములుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజుకున్న రాజకీయ కుంపటి ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాను చుట్టేస్తోంది. ప్రజానిరసన పేరుతో మంత్రి సీతక్క లక్ష్యంగా బీఆర్ఎస్ ముందస్తు ప్రణాళిక ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాయకులు, వారి అనుచరులు ములుగుకు తరలివెళ్ళేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ములుగుకు తరలివెళ్ళిన వారిలో కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. సీతక్క పై నిరసనను బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు విస్తరింపచేశారు. ఈ అంశంపై మంత్రి సీతక్క మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు తీరుపై ముఖ్యంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పై నిప్పులు చెరిగారు. తనను విమర్శించాలంటే ములుగు ప్రజలను సమీకరించాల్సి ఉండగా ఇతర నియోజకవర్గాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తరలివచ్చి బలప్రదర్శనకు దిగడం సిగ్గుచేటన్నారు. నిరసన తర్వాత కూడా రాజకీయ వేడితగ్గకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య విమర్శల వేడికొనసాగుతోంది.

రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలు

ములుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ప్రారంభమైన రాజకీయ విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలకు, నిరసనకు దారితీసింది. ములుగు కేంద్రంగా బలప్రదర్శనకు సిద్ధమై బాహాబాహికి తలపడ్డారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. బీఆర్ఎస్ ములుగులో నిరసన చేపట్టిన రోజే జిల్లాలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్ రావుల పర్యటన చేపట్టారు. దీంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను కట్టడి చేశారు. ఇది జీర్ణించుకోలేని ఆ పార్టీ నాయకులు పోలీసుల తీరుపై విరుచుకపడ్డారు. బీఆరెస్ నిరసనలతో పాటు తన పై చేసిన విమర్శల పై మంత్రి సీతక్క తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేటీఆర్ పైన తీవ్ర విమర్శలు చేశారు. సీతక్క తనదైన శైలిలో శాపనార్థాలు పెట్టారు. ఆదివాసీ బిడ్డనైన నాకు మంత్రి పదవి వస్తే తట్టుకోలేక మీ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని, తన పైన అన్యాయంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి సీతక్క కడుపమండి బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ పైన తీవ్ర విమర్శలు, శాపనార్థాలు పెట్టడంతో ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో రంగంలోకి దిగిన మహిళా నాయకులు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవితలు.. సీతక్క విమర్శల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్యవతి విమర్శల పైన డిప్యూటీ స్పీకర్ రామచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు మంత్రిగా ఉంటే డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో మిమ్మల్ని రానివ్వలేదని, ఉమ్మడి జిల్లాలో పర్యటించాలంటే అడ్డంకులు సృష్టించారంటూ గుర్తు చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కీలక మంత్రిగా ఉన్న సీతక్క పై ఆరోపణలు చేస్తూ బీఆర్ఎస్ ప్రజా నిరసన పేరుతో ప్రారంభించిన ప్రత్యక్ష కార్యాచరణ, విమర్శలు ఇప్పుడిప్పుడే సద్దుమణిగే అవకాశాలు లేవని పరిశీలకులు భావిస్తున్నారు.

# రాష్ట్రంలో రైతులను పట్టించుకోని ప్రభుత్వం



అమరావతి, రాష్ట్రంలో రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గిట్టుబాటు ఇవ్వడం లేదని వైసీపీనేత మాజీమంత్రి పేర్ని నాని మండిపడ్డారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అన్నారు. రైతుల వద్దకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెళ్తే ఏడుస్తారు అని కూటమి ప్రభుత్వంను విమర్శించారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అని పేర్కొన్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్ గారిని తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా? అని పేర్ని నాని ప్రశ్నించారు. శుక్రవారం అమరావతిలో మాజీమంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, కోకో.. తాజాగా మామిడి పంటలు పండుతున్న రైతుల కడగండ్లు ప్రభుత్వానికి కనిపించటం లేదు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అర్థం ఏంటి?. ముందు నుంచి ఒకరు.. వెనుక నుంచి మరొకరు కోస్తారని అర్థమా?. రైతుల గోడు పట్టించుకునే నాధుడు లేడు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్‌ను తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా?. హామీలు ఇచ్చిన మూడు పార్టీల్లో ఇద్దరు అవునంటారు.. మరొకరు తెలియదు అంటారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల బాధలు పట్టించుకుంటు-న్నారా?. మిర్చి, పొగాకు రైతుల బాధలు చూడటానికి వెళ్తే సినిమా సెట్టింగుల యాత్రలు అంటారు. జగన్ వెళ్తుంటే విమర్శిస్తారు.. మీరు వెళ్ళి చూస్తుంటారు. మిర్చి యార్డు ఉన్న కేంద్ర మంత్రి రైతుల కోసం వెళ్లారా?. ఒక్క ఎమ్మెల్యే అయినా రైతుల కోసం వెళ్లారా?. మీరు పట్టించుకోరు, రైతులకు గిట్టు-బాటు- ఇవ్వరు.. జగన్ వెళ్తే ఏడుస్తారు' అని పేర్ని నాని మండిపడ్డారు. పొగాకు రైతుల కోసం జగన్ వెళ్తే ఒక 20 మంది పచ్చ మూకలను పంపిస్తారు. వాళ్లకు డబ్బులు ఇచ్చి పంపిస్తారు. మీ టీ-వీ డిబేట్లలో డబ్బులు ఇచ్చి జగన్‌ను తిట్టిస్తారు. జగన్‌ను తిట్టకుండా ఒక్క డిబేట్ ఉంటు-ందా?. మీరు వచ్చినప్పటి నుంచి చేసిందేమీ లేదు కాబట్టి.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టు-కున్నారు. ఉదయం, సాయంత్రం మీ వ్యాపారం మొత్తం జగన్ మీదే కదా. ఇవాళ మామిడి రైతుల గురించి ఇష్టం వచ్చినట్లు- మాట్లాడుతున్నారు. జగన్ పర్యటనకు హెలెక్రాప్టర్కు పర్మిషన్ ఇవ్వరు. తప్పుడు మాటలు.. విష ప్రచారం.. అసత్యాలు మాట్లాడుతున్నారు. జగన్ బంగారుపాళ్యం వెళ్తున్నారని కేబినెట్లో తీర్మానం చేస్తారు. వీళ్లకు అబద్దాల ప్రచారం తప్ప మరొకటి లేదు. 9వ తేదీ జగన్ వెళ్ళగానే 260 కోట్లు- విడుదల చేశామన్నారు.. జీవో వచ్చిందా. ఎవరి-కై-నా సమాచారం ఉందా?. ఒక్క మామిడి రైతుకన్నా న్యాయం చేశారా. రైతు కష్టం గురించి తెలియని వాళ్ళు.. విచిత్రమైన వ్యవసాయ శాఖ మంత్రి 80 శాతం కొనేసాము అంటారు. మరో మంత్రి 90 శాతం కొన్నారని అంటారు.. ఎవరిది నిజం' అని పేర్ని నాని ఫైర్ అయ్యారు. జగన్ వెళ్తున్నారని.. వాడు, వీడు అంటున్నాడు. మిమ్మల్ని వాడు, వీడు అనలేమా. జగన్ ఎప్పుడు కూడా వాడు, వీడు అని శత్రువుల గురించి కూడా మాట్లాడరు. అమ్మఒడి అందరికీ వేశామని చెప్పారు.. లక్ష మందికి అయినా 13 వేలు పడ్డాయా. ఈ దిక్కుమాలిన ప్రభుత్వం దగ్గరి నుంచి ఎలా వంచించాలో నేర్చుకోవాలి. 6.50 లక్షల టన్నుల పంట పండింది. 80 శాతం కొన్నామని వ్యవసాయ శాఖ మంత్రి.. 90 శాతం కొన్నామని సివిల్ స్లపై మంత్రి చెబుతారు. కలెక్టర్ మాత్రం 67 శాతం అని చెప్పారు. ఒక్క రైతు దగ్గరకు వెళ్లని వ్యవసాయ మంత్రి 80 శాతం కొనేసామని చెప్పారు.. సివిల్ స్లపై మంత్రి 90 శాతం అంటారు. మీ అబద్ధాలకు పోయే కాలం రాదా. ఫైనాన్స్ కాన్కరెన్స్ లేకుండా జీవో ఫైల్ జెనరేట్ చేశారు. ఏమీ చేయకుండా మమ అనేశారు' అని పేర్ని నాని విమర్శించారు.

# వారసులు టిడిపిలో.. తండ్రులు బిజెపిలో.. బాబు మార్క్ రాజకీయం!



అమరావతి,ఆంధ్రప్రదేశ్ లో విచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయి. మూడు పార్టీలు ఉమ్మడి ప్రభుత్వాన్ని నడుపుతుండగా.. చంద్రబాబు స్పష్టమైన ముద్ర చాటుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నుంచి సంపూర్ణ సహకారం ఆయనకు అందుతోంది. మరోవైపు బిజెపి సైతం ఏపీ విషయంలో చంద్రబాబుకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దీంతో మూడు పార్టీల ఉమ్మడి ప్రభుత్వాన్ని చంద్రబాబు అలవోకగా ముందుకు తీసుకెళ్లగలుగుతున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ క్యాడర్ చెక్కుచెదరకుండా గట్టి చర్యలే తీసుకుంటున్నారు. టిడిపి క్యాడర్ క్షేత్రస్థాయిలో బలంగా ఉంటేనే వచ్చే ఎన్నికల్లో కూటమి గెలిచే అవకాశం ఉంటుంది. అందుకే టిడిపి క్యాడర్ను పట్టిష్టపరిచే నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తున్నారు చంద్రబాబు. దీనికి సైతం జనసేనతో పాటు బిజెపి నుంచి చంద్రబాబుకు సంపూర్ణ సహకారం అందుతుండడం విశేషం. అయితే ఈ పరిస్థితుల్లో కొన్ని నియోజకవర్గాల్లో టిడిపి ఇన్చార్జిల నియామకం చిత్ర విచిత్రాలకు కారణమవుతోంది.

టిడిపి అనుబంధ సంస్థగా..

వాస్తవానికి బిజెపి జాతీయ పార్టీ. దేశంలోనే శక్తివంతమైన పార్టీ. కానీ ఏపీలో మాత్రం టిడిపికి అనుబంధ సంస్థగా మారిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. బిజెపిలో ఉన్న ఎమ్మెల్యేలు ఎక్కువమంది టీడీపీ నుంచి వెళ్లిన వారే. అంతెందుకు ఎన్నికలకు ముందు టిడిపి నుంచి బిజెపిలో చేరి టిక్కెట్లు దక్కించుకున్న వారు ఉన్నారు. ఎమ్మెల్యేలు అయిన వారు ఉన్నారు. అయితే అక్కడ పేరుకే బిజెపి ఎమ్మెల్యేలు కానీ.. వారు టిడిపి ఎమ్మెల్యేలు గానే చలామణి అవుతున్నారు. ఇప్పుడు అక్కడ కొత్తగా ఇన్చార్జిలను నియమించాలని టిడిపి భావిస్తోంది. కానీ ఆ ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయంగా నియమిస్తున్న ఇన్చార్జులు బిజెపి ఎమ్మెల్యేలకు సమీప బంధువులు కావడం గమనార్హం.

అనపర్తిలో అలా ఛాన్స్..

మూడు పార్టీల మధ్య ఈ ఎన్నికల్లో పొత్తు కుదిరింది. అయితే బిజెపికి సరైన అభ్యర్థులు లేకుండా పోయారు. ఈ క్రమంలో టిడిపి నుంచి నేతలను బిజెపిలోకి పంపించి పోటీ చేయించారు. అలా వెళ్ళిన వారే అనపర్తి బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. వైసిపి హయాంలో అనపర్తి లో ఎంతో కష్టపడ్డారు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. కానీ చివరి నిమిషంలో ఈ సీటును పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించారు. దీంతో రామకృష్ణారెడ్డి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. వెంటనే ఆయనను బిజెపిలో చేర్పించి ఆ పార్టీ టికెట్ ఇప్పించగలరు చంద్రబాబు. అయితే ఇప్పుడు అదే నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జిని నియమించాలని భావిస్తున్నారు చంద్రబాబు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ కు టిడిపి బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే తండ్రి బిజెపికొడుకు టిడిపి ఇన్చార్జ్ అన్నమాట.

కర్నూలులోనూ అంతే..

అయితే ఇదే పరిస్థితి కర్నూలు జిల్లాలో కూడా ఉంది. అక్కడ సీనియర్ నేత, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ బిజెపి నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన కుమారుడు భరత్ రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. టిడిపి నుంచి బిజెపిలో చేరిన టీజీ వెంకటేష్ కుమారుడికి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి టికెట్ ఇప్పించుకున్నారు. టిడిపి ఎమ్మెల్యేగా గెలిచిన భరత్ మంత్రి కూడా అయ్యారు. అయితే వెంకటేష్ మాత్రం బిజెపిలోనే కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఇలా మేనేజ్ చేయడం అనేది చంద్రబాబు ఒక్కరికే సాధ్యం.అయితే టిడిపి నుంచి ఎన్నికలకు ముందు జనసేనలో చేరిన చాలామందికి కూడా ఇట్టే టిక్కెట్లు లభించాయి.

# గోషామహల్‌కు ఉప ఎన్నిక తప్పదా?

హైదరాబాద్: బిజెపి ప్రాథమిక సభ్యత్వానికి ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన రాజీనామాను పార్టీ నాయకత్వం ఆ మోదించింది. దీంతో రాజాసింగ్ ప్రాతినిథ్యం వ హిస్తున్న గోషామహల్ నియోజకవర్గానికి ఉప ఎ న్నిక అనివార్యం. పూర్వాపరాల్లోకి వెళితే.. బిజెపి అధ్యక్ష పదవిని ఆశించిన రాజాసింగ్ నామినేషన్ దాఖలు చేసేందుకు పార్టీ కార్యాలయానికి వెళ్ళడం, అక్కడ తన ముఖ్య అనుచరుల పట్ల దౌ ర్జన్యం జరిగిందని, దీంతో మనస్థాపానికి గురైన తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన ప్రకటించారు. అంతేకాకుండా రాజీనామా లేఖను లిఖితపూర్వకంగా పార్టీ కార్యాలయానికి పంపించారు. అప్పుడు అ ధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆ రాజీనామా లేఖను పార్టీ జాతీయ నాయకత్వానికి పంపించారు. కాగా పార్టీ జాతీయ అధ్యక్షు డు జెపి నడ్డా ఆయన రాజీనామాను ఆమోదించినట్లు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఈ మేరకు లేఖను రాజాసింగ్‌కుపంపించారు.దీంతో గోషామహల్ నియోజకవర్గానికి ఉ ప ఎన్నిక అనివార్యమా? అనే చర్చ ప్రారంభమైం ది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలు (పార్టీ ఫి రాయింపుల నిరోధక చట్టం) ప్రకారం ఎంపీ లే దా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్వచ్ఛందంగా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినా, ఆ రాజీనామాను పార్టీ నాయకత్వం ఆమోదించినా సదరు సభ్యుని సభ్యత్వం రద్దవుతుంది. అయితే చ ట్టంలో ఒక మెలిక ఉంది. పదవ షెడ్యూలులోని ఆరవ సెక్షన్ ప్రకారం సదరు సభ్యుని సభ్యత్వం రద్దును స్పీకర్/చైర్మన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు సదరు సభ్యుని పార్టీ అగ్ర నాయకత్వం స్పీకర్‌కు లేఖ రాయాల్సి ఉంటుంది. తమ సభ్యుడు పార్టీకి చేసిన రాజీనామాను ఆమోదించడం జరిగింది కాబట్టి మీరు ఆ సభ్యుని సభ్యత్వం విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ లేఖలో ఉండాలి.పార్టీ నాయకత్వం నుంచి లేఖ రాని పక్షంలో అది పార్టీ అంతర్గత విషయంగానే ఉంటుంది. అలా లేఖ వచ్చిన తర్వాత కూడా సదరు సభ్యుని గుణగణాలను పరిగణలోకి తీసుకుని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని పదవ షెడ్యూలులో స్పష్టంగా ఉంది. ఈ విషయంలో స్పీకర్



వెంటనే నిర్ణయం తీసుకోకుండా సదరు సభ్యున్ని పిలిపించుకుని ముఖాముఖిగా మాట్లాడిన తర్వాతే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.ఇప్పుడు రాజాసింగ్ రాజీనామా విషయంలోనూ ఏమి జరుగుతుందనేది సస్పెన్స్‌గానే ఉంది. ఎందుకంటే రాజాసింగ్ పార్టీకి చేసిన రాజీనామాను పార్టీ జాతీయ నాయకత్వం ఆమోదించింది. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించినట్లు పార్టీ నాయకత్వం స్పీకర్‌కు లేఖ పంపిస్తుందా? లేదా? అనే స్పష్టత లేదు.రాజాసింగ్ తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయాన్ని బిజెపి జాతీయ నాయకత్వం స్పీకర్‌కు లేఖ ద్వారా తెలిపితే ఉప ఎన్నిక జరుగుతుందన్న చర్చ పార్టీలో జరుగుతున్నది. గోషామహల్‌లో తనకు పట్టు ఉందన్న ధీమా ఉంది కాబట్టే రాజాసింగ్ రాజీనామా చేసి ఉంటారని కొందరు, సెంటిమెంట్ ద్వారా తిరిగి గెలుపొందుతారని మరి కొందరు అంటున్నారు. శివ సేన పార్టీకి రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు తీసుకుంటారన్న ప్రచారం ఆయన రాజీనామా చేసినప్పటి నుంచే ఉంది.

అమర్‌నాథ్ యాత్రలో రాజా సింగ్

ఇదిలాఉండగా రాజీనామాను పార్టీ జాతీయ నాయకత్వం ఆమోదించడంపై రాజా సింగ్ అభిప్రాయం తెలుసుకోవడానికి ప్రయత్నించగా, ఆయన ఫోన్‌లో స్పందించలేదు. రాజాసింగ్ అమర్‌నాథ్ యాత్రలో ఉన్నట్లు తెలిసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com